కాఫీ కప్పుల మధ్య అజ్ఞాత ప్రియుడూ, న్యాయవాదీ!

# "తొణికిన స్వప్నం, తొలగిన స్వర్గం"

అమరశ్రీ

పని ఉన్నా, ఏ మనిషీ బయటకురా సాహసించలేకపోతున్నాడు. అందుచేతనే బజార్లన్నీ నిర్మానుష్యంగా ఉన్నయ్. ఊరంతా 'కర్ఫ్యూ' అమలులో ఉన్నట్టుగా ఉంది.

ఎవరూ రాకపోవటంచేత శర్మ ఒక కుర్చీలో కూర్చుని కునికిపాట్లు పడుతూ, మధ్య మధ్య ఏదో జ్ఞాపకం వచ్చినవాడిలా ఉలిక్కిపడి లేస్తున్నాడు. మేనేజరు మ్రోగించిన కాలింగ్ బెల్ చేసిన ధ్వనికే మేలుకున్నాడు శర్మ.

లేచీ లేవటంతోనే అన్ని కుర్చీలూ కలయజూచాడు. హాలుమధ్య పంకా క్రింద కుర్చీలో కూర్చొంటున్నాడొక యువకుడు. చేతిలో ఉన్న పుస్తకాలు ఒక్కసారి బల్లమీద పారేసి 'బుష్ షర్ట్' జేబులోకి చెయ్యిపోనిచ్చి జేబుగుడ్డ తీసి ముఖం తుడుచుకుంటున్నాడు, ఏదో ఘన కార్యం చేసివచ్చిన ధీరుడిలా. పాపం! ఎండలో వచ్చాడుగదూ, అంత మందంగా ఉన్న బుష్ షర్ట్ కూడా చెమటతో తడిసిపోయింది. తుడుచుకుంటూనే చప్పున వాలిక గొరుక్కొని, టేబిలు మీద వేసిన పుస్తకాలు కాస్త త్రోసి తుడిచాడు. టేబిలుమీద నీళ్లున్న సంగతి పరికించలేకపోయాడు. ఎండలో నుండి వచ్చాడుగదూ!

కట్టుకున్న గూడకట్టు సవరించుకుంటూ తయారయ్యాడు శర్మ. శర్మ అడగకముందే 'ఏముంది?' అన్నాడా విద్యార్థి.

'పకోడా, బూందీ, మైసూర్‌పాక్, పెసర దోసె...' అంటూ మామూలు పాట పాడాడు శర్మ. ఆ కాలేజీ విద్యార్థి ఎందుకో నోరు చప్పరించాడు తను తినతగింది అక్కడ ఏమీ లేనట్టు.

'ఏమీ వద్దులే! కాఫీ తీసుకురా' అన్నాడు.

వెంటనే వెనుకకుకూడా తిరిగి చూడకుండా పంజాబ్ మెయిల్‌లా పరుగెత్తాడు శర్మ లోపలకు. 'స్ట్రాంగ్‌గా ఉండాలి' అన్న మాటలు లోపల ఉన్న శర్మ వినగలిగాడుకూడా.

గ్లాసులో ఉన్న కాఫీని తిరగ పోసి అతని ముందు పెట్టి, ఒక్కసారి అతని ముఖం వంక చూశాడు శర్మ. అతని ముఖం ఎర్రబడ్డది. ఒకటికి రెండు సార్లు తుడిచాడు కాబోలు అదిమి పట్టి, ఎర్రటివాడు గాబట్టి, ముఖం మరింత ఎర్ర బారింది. అతనివంక చూస్తూనే పక్క బ్లాకులో ఒక కుర్చీమీద కూలబడ్డాడు శర్మ

బల్లమీద చేయిపెట్టి ముఖం చేతికానించి కళ్లు మూసుకున్నాడు - కాస్సేపు కళ్లు మూసుకుంటే సరిపోతుందనుకొని. కాని శర్మ ఏవో వెనుకటి కాలాలకు వెళ్ళిపోతున్నాడు. కూడు పెట్టి, డబ్బిచ్చి చదువుకోమంటే ఎందుకో వాళ్ళకింత అసహ్యం, చేతగానితనమూను! తను కూడా ఒకవేళ అలాతయారయ్యేవాడేమో అదే వాతావరణంలో పెరిగి ఉంటే! కాని తన జీవితం పూర్తిగా వ్యతిరేక వాతావరణంలో పెంపొందింది. తనకే ఆ పరిస్థితు లుంటేనా? ఈ సమయానికి తను కాఫీ అందించే 'సెర్వర్'గా ఉండేవాడు కాదు. నల్ల గౌనులో మెరుస్తూ కోర్టులో జడ్జీగారి ముందర గంభీరంగా వాదిస్తూ ఉండేవాడు!

అబ్బ! ఎంత మార్పు వచ్చింది తన జీవితంలో! శర్మ ఆలోచించుకుపోతున్నాడు. తన జీవితం ఎలా ఉండేదో ఊహించుకునైనా తృప్తి పడుదామనే ఆశతో. నిజానికి తను ఆవిధంగా ఉండడు కాని ఆవిధంగా ఉంటే తను ఎలా 'ఫీ' లయ్యేవాడో ఊహించుకొని, వాడని కారిపోయే రంగులతో చిత్రించుకొని, ఆత్మ సంతృప్తి పడసాగాడు శర్మ.

* * *

తను ఫిఫ్తుఫారం చదువుతున్న రోజులవి. నిజానికి తను కష్టపడి తదేకదీక్షతో చదివే వాడు. కాని ఏం లాభం! తన ముసలి తండ్రికి వచ్చే 'పెన్షన్' తనను స్కూలు ఫైనలు

చదివించలేనని పెదవి విరిచింది. తనుమాత్రం ఏంచేస్తాడు? ఎలిమెంటరీ స్కూలుమాష్టారుగా పనిచేసి 'పెన్షన్' తీసుకుంటున్న తండ్రిమీద ఎంతకాలం ఆవిధంగా ఆధారపడి ఉండటం!

ఆ సంవత్సరమే తన దారిద్ర్య జీవితం అసలు ఆరంభమైంది. తను పిప్తుపారం ప్యాసయిన రోజున తన జీవితంలో క్రొత్త వ్యవస్థ, కొత్త పరిస్థితులు ఉద్భవించినయి.

తను ప్యాసయి ఇంటికొచ్చిననాటి సాయం కాలం అతనికి బాగా గుర్తుంది. ఆనాడే తన తండ్రి తనకు జీవితాన్నిగురించి చెప్పాడు. మరునాటినుంచీ తను జీవితపు లోతుల్లోకి దిగ వలసి వస్తుందనుకో లేదు శర్మ ఆనాటి రాత్రి.

తన జీవితం ఈవిధంగా అధోగతి పాలవు తుందని అతను ఎన్నడూ అనుకో లేదు. అంతకు ముందు అనుకొనే శక్తికూడ లేదు అతనిలో. ఆరోజు తన జీవితం మార్చివేయకపోయినట్లయితే తను ఎలా ఉండేవాడో!

* * *

శర్మపోతున్నాడు నీలినీడల్లోకి. మరుచటి సంవత్సరం తను యస్. యస్. యల్. సి చదివేవాడు అందరిమాదిరిగా. కాని అందరి కంటే ఎక్కువ శ్రద్ధగా చదవటంచేత తను మొదటి సంవత్సరమే ప్యాసయేవాడు. ప్యాసయిన పదిరోజులలో మార్కుల రిజిస్టరు వచ్చేది. అన్నిటిలో తనకు నూటికి అరవై మార్కులకుపైగా వచ్చేవి.

తను 'కాన్డక్టు సర్టిఫికెట్' కోసం హెడ్ మాష్టరు దగ్గరకు పోయేవాడు. చిఱునవ్వుతో ఆయన తనను అభినందించేవాడు. కాలిగోరితో తను నేలను రుద్దుతూ వినయంగా నిలబడేవాడు. సర్టిఫికెట్ల కట్టతో నవ్వుకుంటూ హైస్కూలు గేటు దాటి బయటకు వచ్చేవాడు. వచ్చినట్టు వచ్చి వెనుకకు తిరిగి హైస్కూలు వంకకు తిరిగి కృతజ్ఞతాపూర్వకంగా ఒక నిట్టూర్పు విడిచి ఇంటిముఖం పట్టేవాడు.

తన తల్లీ దండ్రీ ఎంతో ఆప్యాయంగా మాట్లాడి డబ్బులిచ్చి తనను కాలేజీకి పంపే వాళ్ళు. తను పోయి ప్రిన్సిపాల్ చేత సంతకం పెట్టించుకొని, జీతంకట్టి ఇల్లు జేరేవాడు. తరు వాత మంచి రోజొకటి చూసి పెట్టె, బెడ్డింగూ తీసుకొని కాలేజీ హాస్టలులో చేరేవాడు. అందరి కుఱ్ఱవాళ్ళలా తిరిగి చెడిపోకుండా అస్తమానమూ, అందరూ ఎగతాళి చేస్తున్నానరే లెక్కచేయ కుండా కష్టపడి చదివేవాడు. లెక్చరర్లు అతని నంటే పడిచచ్చేలా చేసుకొనేవాడు.

తను యూనివర్సిటీలో ఫస్టున ప్యాసయే వాడు, తనకు బి. యల్. సీటు వచ్చేది. ఆ కోర్సు చదువుతుండేవాడు. పెద్దపెద్ద పుస్త కాలు మోస్తూ అది కూడా ప్యాసయేవాడు.

తన తండ్రి తనకోసమని పట్టణంలో ఒక మంచి ఇల్లు అద్దెకు తీసుకొనేవాడు. ఆ ఇంట్లో మంచి మంచి కుర్చీలు వేసుకొని, పెద్దపెద్ద పుస్త కాల బీరువాలమధ్య కూర్చొని, తన క్లయింట్లకు పాఠాలు నూరిపోసేవాడు తను. ఎంతెంత గట్టి కేసులనయినా గెలిపించేవాడు. తనకు గొప్పకీర్తి వచ్చేది.

ఆవిధంగా ఉంటూండగా అకస్మాత్తుగా తను ఒక పాతస్నేహితురాలిని కలుసుకుంటాడు. ఆమె కూడ బి. యల్. ప్యాసయి ఒకరేఊళ్లో ప్రాక్టీసు పెట్టప్రయత్నించే పరిస్థితుల్లో ఉండేది. ఆమె కూడా తనతోపాటు ప్రాక్టీసు పెట్టటానికి కష్ట పడేది. ఇద్దరూకలిసి ప్రాక్టీసు సాగిస్తుండేవాళ్లు.

అలా ఉంటూ ఉండగా ఆమె తనను ప్రేమించేది. తను కూడ ఆమెను ప్రేమించే వాడు. ఆదర్శప్రాయంగా పెళ్లి చేసుకొనేవాళ్లు. తన తల్లిదండ్రులు తనను చూచి ఎంతో మురిసి పోయేవాళ్ళు- 'ఫలానావారబ్బాయి..' అంటూ అక్కడక్కడా తనను గుఱించి చెప్పుకుంటుంటే తన ముసలితండ్రి సంతృప్తితో ఊపిరి పీల్చే వాడు.

అప్పుడు తనొక చిన్నకారు (సరిక్రొత్తది) కూడా కొంటాడు. రోజూ కోర్టుకు ఇద్దరూ కలిసి ఆ కారులోనే పోయివస్తుండేవాళ్ళు. సాయం కాలం షికారు పోయేవాళ్ళు ఇద్దరూకలిసి.

'మనకొక పాప ఉంటే బాగుంటుంది' అంటుంది తనభార్య కమల.

'అలాగయినా కోర్టుకు రావటం మానుతుంది గదా అని నీ ఉద్దేశ్యం. స్త్రీవైతే మాత్రమేం! ప్లీడరు యుక్తులు!' అంటూ తను ఛలోక్తిగా అనేవాడు.

'ఛా! మీరెప్పుడూ ఇంతే!' అంటూ తన బుగ్గమీద సన్నగా చిటిక వేస్తుంది తన కమల.

కమల కోరిన రీతిగానే తనకొక చిన్నకుర్రవాడు పుట్టేవాడు. తన తండ్రిపేరు పెట్టేవాడు తన చిట్టి తండ్రికి. ఎన్నోరకాల బొమ్మలు తెచ్చేవాడు తన పాపకోసం.

సాయంకాలంపూట చిట్టడుగులు వేస్తూన్న తన బింబంతో పాటు వీధికి షికారు పోయేవాడు. తప్పటడుగులు వేస్తున్న తన పాపను చూచి భార్యా తనూ కులాసాగా మాట్లాడుకునే వాళ్ళు.

చీకటి పడుతుందనగా తను పిల్లవాడిని ఎత్తుకొని కారులో ముందుసీటులో కూర్చుండేవాడు. తన భార్య స్టీరింగు త్రిప్పేది, తన చేతులలోని పిల్లవాడు ఆత్రంగా ఆ స్టీరింగు త్రిప్పుతున్న తల్లి చేతులమీదికి దూకుతూఉంటే తను పట్టుకుని ఆపేవాడు.

ఇంతలో తన గేటుదగ్గర ఆగుతుంది కారు. తన చేతులలోనుండి పిల్లవాడిని తీసుకుంటూ తలుపు తెరిచి ఇంట్లోకి పోతుంది కమల, వెనువెంటే తనుకూడ పోతాడు మెల్లగా బూట్లతో చప్పుడు చేసుకొంటూ.

తనభార్య పిల్లవాడికి అన్నంపెట్టి నిద్రపుచ్చుతుంది. తను నాలుగువందల కేండిల్ బల్బు వెలుతురులో పెద్దపెద్ద పుస్తకాలు తిరగవేస్తుంటాడు. ఆ సమయంలో కమల వస్తుంది. భోజనంచేసి ఇద్దరూ కుర్చీలలో కూర్చుంటారు.

రాత్రిచాలా ప్రొద్దుపోతుంది, భార్య నిద్రపోదామని బలవంతంచేస్తుంది. కాని తెల్లవారితే ఎన్నిపనులు చేయాలో గుర్తుకురాగానే తన మనసు కలవరపడుతుంది. 'పోనీ, నువ్వు పడుకో' అంటాడు తను భార్యవంక చూస్తూ.

భార్య నిర్లక్ష్యంగా ఫ్లాస్కులోని కాఫీ గ్లాసులో పోసి అందిస్తూ కునికిపాట్లు పడుతుంది. తను గ్లాసు చేతితో పట్టుకోకుండానే నోరుజాపి గ్లాసులో కాఫీ తాగుతుంటాడు. ఆ నిద్ర మత్తులో తన భార్య గ్లాసుజారవిడుస్తుంది. గ్లాసు క్రిందపడుతుంది.

* * *

కాఫీ కప్పు చేసిన ధ్వని శర్మకు వినిపించింది.

'బిల్' అంటున్నాడా కాలేజీ విద్యార్థి. త్వరత్వరగా కుర్చీలోనుంచి లేచి, చెవులో ఇరికించుకొన్న పెన్సిలుతో జేబులో ఉన్న బిల్ పుస్తకంమీద రెండణాల బిల్ రాసి చింపి ఇచ్చాడు శర్మ.

"ప్రేమమయమీ జీవనము
త్యాగమయమీ జగమూ!"

# స్వామి భక్తిలోని సౌందర్యం

కాంతం

రంగనాయకులు తెలివిగలవాడు. ఎటువంటి పాతగుడ్డకైనా అతని చేతిలో పడ్డతర్వాత చాలా మంచిదవుతుంది. బేరానికి వొచ్చినవాళ్లని భ్రమించేటట్టు చెయ్యటంలో అతనికతనే సాటి. ఎంతటి అసాధ్యుడు కాకపోతే వెంకట్రత్నం దగ్గిర ఏడాదినుంచీ పని చేస్తున్నాడంటారూ?

వెంకట్రత్నానికి అట్టే బుర్రలేదు. అయితే ఈలోపాన్ని కప్పిపుచ్చగల డబ్బు అతని దగ్గిర పుష్కలంగా వుంది. బుర్రలేకపోతేనేం! తన దగ్గిరవున్న డబ్బుతో బుర్రగలిగినవాళ్ళను డజన్లకొద్దీ కొనగలడు. అమోఘమైన తెలివితేటలుగల అనేకమంది వ్యక్తులు వెంకట్రత్నం దగ్గిర పాతికకీ, నలభైకీ నానాచాకిరీ చేస్తున్నారు. స్వయంగా అతనికి బుర్ర లేకపోతేనేం! ఏం ముంచుకుపోతుంది?

వెంకట్రత్నం కొంతకాలంపాటు సవ్యంగానే వ్యాపారం చేశాడు. లాభాలు రెండుచేతులా పుచ్చేసుకొంటూనే వున్నాడు. అయినా ఆయనగారి దాహానికి ఉపశాంతి కాలేదు. నాలుగు చేతులతోటీ, వీలయితే వెయ్యి